
# అంతేకావాలి

శ్రీమతి భీనాదేవి



సత్యజిత్ రే లాగానో, రిత్విక్ ఘటక్ లాగానో ఓ బ్రహ్మాండమైన సినీమా తీసి ఆస్కార్ అందుకోవాలని మా వారి చిరకాల వాంఛ.

మా చి న్నమ్మాయికి - అది అప్పటి కింకా హౌస్ సర్జనే - అఖండమైన మందు కనిపెట్టి నోబెల్ ప్రైజ్ కొట్టేద్దామని మహా కోరిక.

మారుతీ జిప్సీలో హిమాలయన్ కార్ ర్యాలీలో ఫస్ట్ రావాలని మా పెద్ద కొడుక్కి 'కిల్లింగ్ డిజైర్.'

మా చిన్నవాడికి మాత్రం గదంత పందిరి మంచంమీద జీవిత మంతా బోర్లా పడుకొని నిద్రపోవాలన్న చిరు కోరిక.

ఇవన్నీ తీరని కోరికలు.

దేశం సుభిక్షం కావాలన్న కోరిక గాంధీగారికే తీరలేదు.

నాకు మాత్రం చిన్నప్పటి నుంచీ చెకోవ్‌లా చకచకా కథలు రాసి పారెయ్యాలన్న కోరిక మహా తీవ్రంగా ఉండేది.

అది తీరిందనను కాని ఇరవై ఏళ్లనాడు మొదటి కథ రాశేను.

నా కథకు నేనే బొమ్మ వెయ్యాలన్న కోరిక అతి కష్టంమీద అణుచుకున్నాను.

ఆ కథకు బాపూ బొమ్మ వేస్తే?

ఏం థ్రిల్!

బాపూనే వేశేరు.

ఆ కథ గురించి ఎడిటర్ మహాశయుడికి ఎక్కువ ఉత్తరాలు వస్తే?

ఒక రచయిత్రి వ్యక్తిగత దూషణలతో సహా బోలెడు ఉత్తరాలు వచ్చేయి.

నరమాంసం రుచి మరిగిన పులిలా పది కథలు చకచకా బక్కరేశేను. నాకే ఆశ్చర్యం! అన్నీ పబ్లిష్ అయేయి.

ఈ పదీ పుస్తక రూపంలో వస్తే!

భేషుగ్గా ఉంటుంది కదూ! నవభారత్ ప్రకాశరావు మహా దొడ్డమనిషి. ఆ కథలన్నీ తనే పుస్తక రూపంలో వేశేడు.

మరో పది కథలు. మరో సంపుటం.

నా క్కొంచెం గర్వం, పిసరంత బుర్రతిరుగుడు ప్రారంభించేయి. ఇంక నేను కథలు కాగితాల మీద మానేసి గాలిలోనే రాసేయడం ప్రారంభించేను. ఇంతవరకు కథ సుఖమధ్యమమే.

తరవాతే వచ్చింది లిటిగేషన్.

రెండు పుస్తకాలు వచ్చేసరికి చిన్న కోరిక మొలకెత్తింది. ఆ మొలక మొక్కై మానైంది. ఏ పుస్తకాల షాపులో చూసినా నా పుస్తకాలు చాలా ప్రముఖంగా డిస్ప్లే కావాలి. షోకేసుల్లో అందమైన ఆడపిల్లల్లా నా పుస్తకాలు కనిపించాలి.

అదీ నా కోరిక.

కిట్టని వాళ్ళు దురాశ అన్నారు.

అయితే తా నొకటి తలుస్తే పుస్తకాల షాపువా డొకటి తలుస్తాడని, ఏ షాపువాడూ నా పుస్తకాలు షోకేసుల్లో కాదు కదా స్టాక్‌లో కూడా పెట్టుకోలేదు.

ఈ షాపుల వా ళ్ళందర్నీ ఒకే గోతిలో పాతెయ్యాలి.

మిగతా రచయితల పుస్తకాల డిస్ప్లే చూస్తే నాకు బుర్రలో బాంబులు పేలేవి.

గుండెలో గునపాలు గుచ్చుకునేవి.

ఎంత రైటరైనా బేసిక్‌గా ఆడదాన్నే కదా.

ఆడబుద్ధి పోలేదు.

ఓనాడు మావారు కాస్త ప్రసన్నంగా ఉన్నప్పుడు ఫిల్టరు కాఫీ, ఫారెన్ సిగరెట్లు [ఆయన్ని ప్రసన్నం చేసుకోవడానికి నా దగ్గ రెప్పుడూ ఫారెన్ సిగరెట్లు స్టాకు పెట్టుకుంటాను] ఇచ్చేను. ఈ రెండూ ఇవ్వగానే ఆయనలో మానవత్వం పోయి దైవత్వం వచ్చేసి "నరుడా? ఏమి నీ కోరిక" పోజు వచ్చేస్తుంది.

"నరుడా! కి స్త్రీలింగం ఏఁవిఁటో" అన్నారు సిగరెట్టు తన్మయత్వంతో.

"ఏదో ఒకటి లెండి కాని ఇంత అన్యాయవాఁ? ఏ షాపుకీ ఇవ్వకుండా పబ్లిషరు ప్రకాశరావు నా పుస్తకాలన్నీ ఏం చేస్తున్నట్టు? ఆకలేసినప్పుడల్లా అతనూ, వాళ్ళావిఁడా మేకలు వాల్ పోష్టర్లు తినేసినట్లు తినేస్తున్నారా కొంపతీసి?" కొంచెం విసుక్కున్నాను.

చెప్పేను కదా. అనలే గడుసు మనిషి. ఆపైన దైవత్వం. అంచేత దేవుడు పాపుల్ని చూసి నవ్వినట్టు ఓ జాలి నవ్వు నవ్వేరు.

"నీకు మరీ అంత అసూయ ఉండకూడదే అమ్మీ. మరచిపో! బి హేపీ." సందేశం ఇచ్చేరు.

'ఛీ! ఛీ! ఏం మొగుడో!! ఎప్పటికి న న్నర్థం చేసుకుంటాడు? నే నేదో రచయిత్రుల మీద పడి ఏడుస్తున్నా ననుకుంటున్నారు. నా కలాటి తరతమ భేదం లేదు. నా కసలు ఏ రచయిత పుస్తకం చూసినా చిర్రెత్తు కొస్తోంది.

ఊహూఁ లాభం లేదు. శ్రీశ్రీ చెప్పినట్టు ఎవరో ఏదో చేస్తారని ఎదురు చూడకూడదు. నా సమస్య నేనే పరిష్కారం చేసుకోవాలి. నే నెలాగైనా పాపులర్ కావాలి. పాపులారిటీకి కావల్సింది ప్రతిభ, ప్రజ్ఞ కాదు - ప్రచారం హోరు!

ఈ ప్రాపగాండా టెక్నిక్ సినీమా వాళ్ళకీ, పొలిటీషియన్లకి తెలిసినట్టు నాలాంటి సామాన్య మానవులకి తెలిసి ఛావదు. తెలీదంటే ప నెలా ఔతుందిట!

భగవంతు డంతటివాడు పిల్లింకర్ర ఊది మరీ తను భగవంతుడిననీ, తరుచూ మన మధ్యకు వస్తాననీ స్వయంగా చెప్పుకున్నాడు. అది చాలదేమోనని ఏజెంట్లద్వారా చెప్పించేడు. మ రింక నే నెంత?

అయినా నా యథాశక్తి ప్రయత్నించాలి. ఇందులో, ఇంకో చిన్న దొంగతనం ఉంది. మా వారి కే మాత్రం తెలీకూడదు. ఛీ! ఛీ! జడ్జి పెళ్ళాం అవడం కాదు కాని స్వేచ్ఛ లేకుండా పోయింది. ఏదో ఉపాయం ఆలోచించాలి... చించేను.

ఇది ఇరవై యేళ్ళనాటి మాట, అప్పుడు మా పిల్ల లింకా చిన్నవాళ్ళూను. అంచేత ఆడపిల్లలకి సినీమా కోటా పెంచేను. మొగ వెధవలకి పాకెట్ మనీ పెంచేను.

"ఏఁవిఁటి సంగతి?" అన్నారు నలుగురూ ముక్తకంఠంతో. ఏ వుంది? కనిపించిన ప్రతి పుస్తకాల షాపులోను "బీనాదేవిగారి పుస్తకా లున్నాయా?" అని అడగడం.

అంతవరకు బాగానే ఉంది.

ఆ షాపు వాళ్ళు లేకపోతే లేవని చెప్పొచ్చు కదా!

ఊహూఁ. అధిక ప్రసంగం వీళ్ళను.

"ఎవరండీ ఆవిడ" అని ఒకడు.

"మేము టెక్స్టుబుక్కులు అమ్మం" అన్నా డింకోడు. అక్కడికి టెక్స్టు పుస్తకా లమ్మడం బూతు పుస్తకా లమ్మినంత అఘాయిత్యం అయినట్టు.

"బెంగాలీ పుస్తకా లిక్కడ దొరకవు." మరో మహాశయుడు.

వీళ్ళంతా కొంత సంస్కారవంతులే అనుకోవచ్చు. ఎంచేతంటే "అంత దరిద్రపు కథలు అచ్చువేసిన సన్నాసి ఎవడండీ" అన్నా డింకో ఘనుడూ. దరిద్రం - కథలకో, నాకో, అచ్చువేసిన వాడికో!

ఓసారి...

హైకోర్టులో ఏదో ప నుందని మావారు హైదరాబాదు వెళ్తున్నారు. కారే కదా - నా కేం పెట్రోలు ఎక్కువ అవదు. "తన వెంట సిరి"లా నేనూ బయలుదేరాను.

మావారి కోర్టు పనైపోయింది.

"ఏదైనా పుస్తకాల షాపుకి వెళ్దావాఁ?" అన్నాను కారులోంచి బయటికి చూస్తూ.

వెళ్ళేం. షాపు బ్రహ్మాండం.

పుస్తకాలూ బ్రహ్మాండవేఁ.

మూ డొంతులు ఇంగ్లీషువేఁ.

అంచేత మంచి ధైర్యం వచ్చింది.

"ఎస్ మేమ్!" దగ్గర కొచ్చేడు అసిస్టెంటు.

"బీనాదేవిగారి పుస్తకా లున్నాయా?" నా గొంతుక నాకే కొత్తగా వినిపించింది.

"ష్యూర్ మేమ్!"

గుండె మోకాళ్ళలోకి జారిపోయింది.

"ఆవిడ వర్క్సు అన్నీ ఉన్నాయా?" బ్లఫ్ కొట్టబోయేను.

"ఆవిడ రాసినవి రెండే మేమ్!" మనోహరంగా నవ్వేడు సేల్స్‌మన్. మామూలుగా అయితే ఆ నవ్వుని ఒక పేరా రాయొచ్చు. కాని ఇప్పు డా నవ్వులో చిన్న వెటకారం ఉందా అనిపించింది ఆ క్షణం.

రెండు పుస్తకాలూ తెచ్చి కౌంటరు మీద పెట్టేడు.

నా గుండె మోకాళ్ళలోంచి పాదాల్లోకి దిగిపోయింది.

అక్కడే నిల్చుని సిగరెట్ కాలుస్తూ నవ్వుతున్న మావార్ని చూస్తుంటే - చేతిలో నాటు బాం బుంటే పేల్చేసేదాన్ని.

"పెత్తనానికి పెళ్ళాడేను కాని కూడు పెట్టడం కులాన లే"దన్నాట్ట వెనకటి కెవడో.

పాపులారిటీ కోసం పాకులాడేనే కాని ఎంత నా పుస్తకాలైతే మాత్రం ఇంత ఖరీదు పెట్టి కొనాలా?

పాపం! ప్రకాశరావు నాకు అక్కర్లేనన్ని పుస్తకాలు ఇస్తూనే ఉంటాడు.

ఒక పుస్తకం కొన్నాను.

డబ్బు నేనే ఇచ్చేను.

తిరిగి వెళ్తుంటే డ్రైవ్ చేస్తున్న మా వారి మొహంలో ఏ ఫీలింగూ లేదు.

ఎగతాళి లేదు.

వ్యంగ్యం లేదు.

హమ్మయ్య! తోటికోడలు దెప్పలేదు.

"సెకెండ్ హాండ్ మార్కెట్‌లో హాఫ్ రేట్‌కి అమ్మేస్తే!"

ఈయనకి కర్ణపిశాచి ఉన్నట్టుంది.

"హాఫ్ రేటుకి అమ్మేది సెకెండు హాండు వాడు" అన్నారు అదే మెడిటేషన్ పోజులో.

నేనేం అన్లేదు.

ఆ తరువాత పది రోజులకి విజయవాడలో ఒక సెకెండుహాండు షాపులో హాఫ్ రేట్‌కే అమ్మేను.

మావారికి మాత్రం చెప్పలేదు.

ఆయన కంతే కావాలి. ★

